క్లుప్తంగా

అభయ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విరాళం

పరవాడ: శ్రీభూసమేత శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు విరాళాలు అందుతున్నాయి. పరవాడ గ్రామానికి చెందిన రాజాన శ్యామ్‌కుమార్, బొమ్మిరెడ్డిపల్లి భద్ర రూ.20,116 విరాళాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు శనివారం అందజేశారని కమిటీ ప్రతినిధి మేడిశెట్టి బాలాజీనాయుడు తెలిపారు. విరాళం అందజేసిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరంలో గ్రంథ పఠనం



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జానకిరామ్ చిన్నారులకు నీతి కథలు బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. యోగాసనాల అభ్యసనం చేయించారు. బొమ్మలు వేయడం నేర్పించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా గ్రంథాలయ పరిసరాలను విద్యార్థులు, స్థానిక పెద్దలు శుభ్రం చేశారు. తుప్పలు తొలగించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా అప్పలరాజు



ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పలరాజు

పెందుర్తి: పెందుర్తి మండల ఎంపీడీవోగా గుండు అప్పలరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం పెందుర్తిలోనే ఈవోపీఆర్డీగా సేవలందిస్తుండగా ఆయన్ను ప్రభుత్వం ఎంపీడీవోగా నియమించింది. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తించిన అడ్మినిస్ట్రేషన్ అధికారి కొల్లి వెంకట్రావు తిరిగి అదే స్థానంలో కొనసాగనున్నారు.

ఎన్‌ఏడీ ఆర్‌వోబీ పనుల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న విశ్వనాథన్

విశాఖ విద్య: ఎన్‌ఏడీ వద్ద ఫ్లై ఓవర్‌కు అనుసంధానంగా నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులను శనివారం వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌గా ప్రతీక్ తన్వర్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా ఢిల్లీకి చెందిన ప్రతీక్ తన్వర్ నియమితులైనట్టు తెలిసింది. స్టీల్‌ప్లాంట్ బోర్డులో ఫంక్షనల్ డైరెక్టర్లతో పాటు కొంత మంది ఇండిపెండెంట్ డైరెక్టర్లు కూడా ఉంటారు. ఇండిపెండెంట్ డైరెక్టర్లను కేంద్ర ప్రభుత్వం తమకు నచ్చిన వారిని నియమిస్తుంది. ఇందులో భాగంగా ఢిల్లీకి చెందిన న్యాయవాది ప్రతీక్‌ను నియమించినట్టు సమాచారం. కేంద్ర ఉక్కుమంత్రిత్వశాఖ త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది.

భెల్‌లో ఆక్టోపస్ మాక్ డ్రిల్




ఆక్టోపస్ సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న సౌత్ ఏసీపీ త్రినాథ్

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో ఆక్టోపస్ సిబ్బంది శనివారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద కార్యకలాపాలు, దుష్ట శక్తుల నుంచి భారీ సంస్థలను ఎలా కాపాడుకోవాలో విన్యాసాల ద్వారా అవగాహన కల్పించారు. దీని ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలు రక్షణ వలయంలో ఉన్నాయన్న సంకేతాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడమే లక్ష్యమన్నారు. ఆక్టోపస్ అధికారి రాజారెడ్డి ఆధ్వర్యంలో విన్యాసాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, గాజువాక సీఐ పార్థసారధి సంస్థకు చేరుకుని ఆక్టోపస్ సిబ్బందిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

పోలవరం ప్రధాన కాలువ విస్తరణ..

మళ్లీ మొదటికి

- గత ప్రభుత్వంలోనే పూర్తయిన సర్వేలు, గ్రామ సభలు, రైతుల గుర్తింపు, గెజిట్ పబ్లికేషన్
- ఇప్పుడు మళ్లీ రీసర్వే అంటున్న కూటమి ప్రభుత్వం
- నిర్వాసితుల పరిహారంలోనూ రైతుల్లో మొదలైన గందరగోళం



సబ్బవరం: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ఈ ప్రాంతాలకు అవసరమైన సాగు, తాగునీరు అందించే బృహత్తర లక్ష్యంతో ప్రారంభించబడింది. ఈ పథకాన్ని ఉత్తరాంధ్రుల జీవనాడిగా చెప్పుకుంటారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి సబ్బవరం మండలంలో దీనికి శంకుస్థాపన చేశారు. పోలవరం ఎడమ కాలవను విస్తరించి గోదావరి జలాలను ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా తరలిస్తే ఈ జిల్లాలకు అవసమైన నీరు పుష్కలంగా అందుతుంది. దీంతో ప్రాజెక్టు పూర్తయితే రైతులకు సాగునీరు, పారిశ్రామిక అవసరాలకు జలవనరులు లభ్యమై ప్రాంతీయ అభివృద్ధి జరుగుతుందని, తద్వారా కరువు సమస్య తీరుతుందని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు గత ప్రభుత్వంలోనే సర్వేలు, గ్రామ సభలు, రైతుల గుర్తింపు, గెజిట్ పబ్లికేషన్ వంటివి పూర్తయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వ హయాంలో రీసర్వే అంటూ అంతా మళ్లీ మొదటికి తీసుకొస్తున్నారు. పరిహారం విషయంలోనూ రైతుల్లో గందరగోళం నెలకొంది.

భూసేకరణ ఇలా..

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో ప్రధాన కాలువ విస్తరణకు సబ్బవరం మండలంలో సుమారు 296.03 ఎకరాల భూమిని సేకరించనున్నారు. మండలంలోని ఆరిపాక, అంతకాపల్లి, అయ్యన్నపాలెం, ఎ. సిరసపల్లి, ఎల్లుప్పి, రాయపుర అగ్రహారం, నల్లరేగులపాలెం, వంగలి, బంగారమ్మపాలెం గ్రామాల్లో సుమారు 700 అడుగుల వెడల్పున ఈ కాలువ విస్తరించనున్నారు. గత ప్రభుత్వంలో ఈ కాలువ విస్తరణకు సంబంధించి అలైన్‌మెంట్ ప్రకారం కాలువకు సేకరించే భూముల్లో సర్వే నిర్వహించడం, గ్రామ సభలు ఏర్పాటు చేయడం, గెజిట్ నోటిఫికేషన్ పేపర్లలో పబ్లిష్ చేయడం వంటి 80 శాతం వరకూ పనులు పూర్తి చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పోలవరం కాలువ విస్తరణ పనుల అభివృద్ధి నిలిచిపోయింది. ఇప్పటికే పూర్తయిన సర్వేలను పక్కన పెట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరలా మొదటి నుండి సర్వే నిర్వహించమనడంతో కాలువ విస్తరణకు సంబంధించిన పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీంతో ఆయా గ్రామాల్లో కాలువ విస్తరణలో భూములు కోల్పోయే రైతులు తీవ్ర ఆయోమయానికి గురవుతున్నారు.

గ్రామం	భూ సేకరణ (ఎకరాలలో)	పాత ధర సెంట్లలో (రూ)	పాత ధర గజాలలో	పెరిగిన ధర సెంట్లలో	పెరిగిన ధర గజాలలో
ఆరిపాక	70.99	30,000	4,000	32,000	5,000
అంతకాపల్లి	20.52	17,000	2,700	25,000	4,000
అయ్యన్నపాలెం	06.47	18,000	1,300	25,000	2,000
ఎ. సిరసపల్లి	03.21	11,000	600	15,000	2,000
ఎల్లుప్పి	72.06	16,000	1,700	22,000	3,500
రాయపుర అగ్రహారం	26.58	16,500	1,100	25,000	3,000
నల్లరేగులపాలెం	54.36	17,000	1,500	20,000	3,000
వంగలి	39.93	8,500	1.100	18,000	3,500
బంగారమ్మపాలెం	02.91	11,000	1,100	20,000	2,000

పరిహారం విషయంలో అయోమయం..

సబ్బవరం మండలంలోని 9 గ్రామాల్లో ప్రధాన కాలువను విస్తరించనున్నారు. సబ్బవరం విశాఖ నగరానికి అత్యంత సమీపంలో ఉండటంతో పాటు వాణిజ్యపరంగా అనేక విశ్వ విద్యాలయాలు, జాతీయ రహదారులు కలిగి ఉన్న ప్రాంతం. దీంతో ఈ భూములకు ఉన్న ప్రభుత్వ ధర కంటే బహిరంగ మార్కెట్‌లో 5 నుండి 10 రెట్ల వరకూ అధికంగా పలుకుతుంది. ఈ కాలువ విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు గత ప్రభుత్వంలో ఉన్న ప్రభుత్వ ధరకు అదనంగా 1.25 రెట్లు కలిపి ఇవ్వనున్నట్లు గతంలో ప్రకటించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత భూముల ప్రభుత్వ ధరలను మరింత పెంచింది. దీంతో ప్రస్తుతం పోలవరం కాలువ విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులు తమకు చెల్లించే పరిహారం పాత ధరల ఆధారంగా చెల్లిస్తారో లేక పెరిగిన ధరల ప్రకారం చెల్లిస్తారో అని అయోమయంలో ఉన్నారు. దీనిపై అధికారులు ఇప్పటి వరకూ ఏ విధమైన స్పష్టతా ఇవ్వలేదు.

తీరనున్న సాగు.. తాగునీటి అవసరాలు..

ఈ పథకం ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో సాగు, తాగు నీటి అవసరాలు తీరడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందనుంది. సుమారు రూ.17,050.20 కోట్ల అంచనా నిధులతో పథకాన్ని చేపట్టగా మొదటి దశలో రూ.2,022.20 కోట్లతోను, రెండో దశలో రూ.15,028 కోట్ల అంచనా నిధులతో పనులు చేపట్టనున్నారు. గోదావరి నదిపై ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాలువలు నిర్మించి నీటిని సరఫరా చేయనున్నారు. ప్రధాన కాలువను 63.99 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయగా 3.98 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు 30 వేల క్యూసెక్కులను నీటిని తరలించనున్నారు.

మరలా సర్వే నిర్వహిస్తాం..



పోలవరం సుజల స్రవంతి కాలువ విస్తరణకు గతంలో సర్వే చేశాం. అయితే తర్వాత కొన్ని గ్రామాల్లో రీ సర్వే జరగడం, అది జరిగి సంవత్సరం పైనే కావడంతో మరోసారి సర్వే చేయాల్సి ఉంది. సర్వే తర్వాత క్రయ విక్రయాలు జరిగి భూ సేకరణలో భూములు కోల్పోయే రైతులను గుర్తించేందుకు ఆయా గ్రామాల్లో మరలా సర్వే నిర్వహిస్తాం.

–అప్పారావు, డిప్యూటీ తహసీల్దార్, సబ్బవరం మండలం.

ఆరోగ్యం పట్ల అవగాహన అవసరం



రోగులతో మాట్లాడుతున్న సీపీ శంకబ్రత బాగ్చీ



రోగులకు మందులు అందిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

పెందుర్తి: ప్రజలు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చింతల అగ్రహారం వీరాంజనేయ ఆలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని సీపీ ప్రారంభించారు. వ్రింద మల్టీ స్పెషాలిటీ ప్రతినిధి డాక్టర్ వంశీధర్ పుత్రేవు ఆధ్వర్యంలో వైద్యులు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు జరిపారు. అనిల్ నీరుకొండ హాస్పిటల్ ఆధ్వర్యంలో సాధారణ వైద్య పరీక్షలు, చిన్న పిల్లల పరీక్షలు, స్త్రీల సమస్యలు, చర్మవ్యాధులు, దంత సమస్యలపై పరీక్షలు జరిపారు. సీపీ చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఈసీజీలు ఉచితంగా తీశారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన సీఐ కె.వి. సతీష్‌కుమార్‌తో పాటు సిబ్బందిని, సహకారం అందించిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులను, వైద్యులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. జోన్–2 లా అండ్ ఆర్డర్ డీసీపీ మేరీ ప్రశాంతి, సౌత్ ఏసీపీ త్రినాథ్, సీఐ కె.సతీష్ కుమార్, సర్పంచ్ దాడి గోపీ వెంకటలక్ష్మి, సాయి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్, పలువురు అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేసిన సీపీ..

స్వతహాగా వైద్యుడైన సీపీ శంఖబ్రత బాగ్చీ వైద్య శిబిరంలో స్టెతస్కోప్ వేసుకుని కాసేపు కలియదిరిగారు. శిబిరానికి హాజరైన రోగులకు పరీక్షించారు. రోగులతో చొరవగా మాట్లాడి వారిలో ధైర్యం నిపారు.

పగలూరాత్రీ ఆరని దీపాలు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. దేశపాత్రునిపాలెం శివారు జాజులవానిపాలెం, గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైటు, వీధి దీపాలు పగలూ రాత్రీ తేడా లేకుండా వెలుగుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. రోజూ వెలిగించడం.. ఆపడం ఎందుకులే అన్న రీతిలో పంచాయతీల సిబ్బంది వీధి లైట్లను నిత్యం ఆర్పకుండా వదిలేస్తుండడంతో విద్యుత్ వృథా అవుతోంది. వీధి లైట్ల నిర్వహణ పట్ల పంచాయతీల సిబ్బంది నిర్లక్ష్యం వహించడం తగదని ప్రజలు మండిపడుతున్నారు. గ్రామ ప్రాంతాల్లో వీధి లైట్ల నిర్వహణ సక్రమంగా అమలు జరిగే విధంగా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



జాజులవానిపాలెంలో పట్టపగలు వెలుగుతున్న హైమాక్స్ లైట్



జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పగలు వెలుగుతున్న వీధి దీపాలు

గోవిందునికి సహస్ర సుతఫల అర్చన



పూజల్లో పాల్గొన్న భక్తులు



వేంకటేశ్వరస్వామికి నైవేద్యంగా మామిడి పళ్లు సమర్పించిన దృశ్యం

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం చేశారు. అనంతరం తోమాల సేవ, స్వామివారికి సహస్ర సుతఫల (1008 మామిడి పళ్లు) అర్చన గావించారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

సమ్మెతో స్టీల్ యాజమాన్యాన్ని ప్రతిఘటిస్తాం



ధర్నాలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సమ్మెతో ప్రతిఘటిస్తామని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. ఈ నెల 20న కార్మిక సమ్మె నేపథ్యంలో శనివారం ఉక్కు పరిపాలన భవనం కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి డి. ఆదినారాయణ మాట్లాడుతూ యాజమాన్యం వైఖరికి వ్యతిరేకంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ మూడు నెలలుగా లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించలేదన్నారు. కార్పొరేటర్ బి. గంగారావు మాట్లాడుతూ ప్యాకేజీ పేరిట స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం మోసం చేస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు కె.ఎస్.ఎన్.రావు, పి.వి. రమణమూర్తి, రామస్వామి, గణపతిరెడ్డి, డి.వి. రమణారెడ్డి, రామ్‌కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రతో పరిసరాలు పరిశుభ్రం



బాటజంగాలపాలెంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెను పరిశీలిస్తున్న అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్



తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ



రావాడలో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీడీవో రమేష్‌నాయుడు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి ఈవో సుజాత

సబ్బవరం: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రతో పరిసరాలు పరిశుభ్రం అవుతాయని, ప్రతి ఒక్కరూ ఇల్లు, పరిసర ప్రాంతాల్లో మొక్కలు పెంచడం ద్వారా ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు కృషి చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ది హీట్ నినాదంతో ప్రయాణికులు, బాటసారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి షెల్టర్, చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ప్రజలకు కలిప్తున్న అవగాహన కార్యక్రమం గురించి, వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో మాతృ మరణాలు ఎక్కువగా ఉన్నాయని, హైరిస్క్ కేసులను నిత్యం పర్యవేక్షించాలని, మాతా శిశు మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి కుండీని ప్రారంభించారు. క్యాన్సర్ టెస్టింగ్ సెంటర్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కె. రాజ్ కుమార్, మండల ప్రత్యేక అధికారి కె. రమామణి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీష రాణి, రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ ఈ నాగలక్ష్మి, తహసీల్దార్ బి. చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజ, మెడికల్ అధికారి డాక్టర్ అశ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ జె. మణికుమార్, సర్పంచ్ పడాల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: జేఎన్‌పీసీ మ్యాన్ ఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అసోసియేషన్ భవనం వద్ద తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను అనకాపల్లి డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.వి.వి.ఎస్ నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌పీసీఎం అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్.సూర్యప్రకాశరావు, కార్యదర్శి జె.సుబ్బారావు, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు సి.పి.సి. కమలాకర్‌రావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు ఎం.వి.ఎస్.వి. ప్రసాదరాజు పాల్గొన్నారు.

- విశాఖ ఫార్మాసిటీలో సీయాంక ఫార్మా పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ జె.సుబ్బారావు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిశ్రమ ఆవరణలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు, కార్మికులు ప్రతిజ్ఞ చేశారు.
- నాయుడుపాలెం గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. సచివాలయ కార్యాలయం, సంపద తయారీ కేంద్రం పరిసరాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది చెత్త సేకరించారు. గ్రామ సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీ సీతారామయ్య, ఎంపీటీసీ కూండ్రపు అక్కయ్యమ్మ, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బండారు శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి త్రినాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- రావాడ గ్రామ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. పరవాడ ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలకు ఎంపీడీవో రమేష్‌నాయుడు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.
- వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వి.కనకప్పారావు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రం చేశారు.

సింహగిరిపై..

సింహాచలం: సింహగిరిపై స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని దేవస్థానం ఈవో ఎస్.సుజాత తెలిపారు. ఉద్యోగులతో ఆలయ రాజగోపురం వద్ద ప్రతిజ్ఞ చేయించారు. నక్షత్రవనం, ప్రసాదాల విక్రయశాల తదితర ప్రాంతాల్లో ఉద్యోగులు చెత్తా చెదారాలు తొలగించారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాఖ విద్య: ఉపాధి అవకావాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని మురళీకృష్ణ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ నిరంజన్ సాయి అన్నారు. మ్యాజిక్ బస్ రిలయన్స్ ఆధ్వర్యంలో ఎన్ఏడీ దరి బాజీ జంక్షన్‌లోని మురళీ కృష్ణ డిగ్రీకాలేజీలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 315 మంది విద్యార్థులు హాజరుకాగా ప్రతిభ చూపిన 185 మందిని వివిధ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ సాయి మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ చదువులతోనే పోటీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మ్యాజిక్‌బస్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ అప్పలరాజు, కాలేజీ ప్రిన్సిపాల్ బి. శ్యామ్‌వల్లభ రావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



అప్పన్నకు యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

నాణ్యతలో రాజీ వద్దు



స్టోర్స్‌లో ప్రసాదాల ముడి సరుకును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఈవో సుజాత

సింహాచలం: ప్రసాదాలు, అన్నప్రసాదానికి వినియోగించే సరుకుల నాణ్యతని అధికారులు, స్టోర్స్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించాలని సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో ఎస్. సుజాత సూచించారు. సింహగిరిపై ఉన్న స్టోర్స్‌ని శనివారం ఆమె సందర్శించారు. ముడి సరుకులను పరిశీలించారు. సాంపిల్స్ ఎప్పటికప్పుడు టెస్టింగ్‌కి వెళ్తున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రసాదాల తయారీశాలను పరిశీలించిన ఆమె లడ్డూ, పులిహోర తయారు చేసే సిబ్బందితో మాట్లాడారు. నాణ్యంగా ప్రసాదాలు తయారు చేయాలని సూచించారు. అన్నప్రసాదాన్ని పరిశీలించిన ఆమె భక్తులు సంతృప్తి చెందేలా అన్నప్రసాదం తయారు చేయాలని సూచించారు. స్టోర్స్ ఏఈవో పిల్లా శ్రీనివాసరావు, ఉద్యోగులు ఆమె వెంట ఉన్నారు.